క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

అనంతగిరి(అరకులోయ టౌన్): మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం ఉదయం 10.30 గంటలకు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ శెట్టి నీలవేణి అధ్యక్షతన అనంతగిరి మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అందరూ హాజరుకావాలన్నారు. మండలంలోని అన్ని శాఖలకు చెందిన అధికారులు పూర్తి స్థాయి సమాచారంతో పాటు గడిచిన నెలల్లో ఆయా శాఖల పురోగతితో విధిగా హాజరు కావాలని ఆయన సూచించారు.

నేడు సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం

కొయ్యూరు: సింగవరం షిర్డీ సాయిబాబా ఆలయ 20వ వార్షికోత్సవం సోమవారం జరగనుంది. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేయనున్నారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లు చేశారు.

జోరుగా యూటీఎఫ్ ప్రచారం



అరకులోయలో ప్రచారం చేస్తున్న ఏపీజీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బాలదేవ్, తదితరులు

అరకులోయ టౌన్: ఈ నెల 27న జరిగే ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో యూటీఎఫ్ బలపరిచిన పీడీఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయగౌరికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఏపీ ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ కోరారు. ఆదివారం అరకులోయ మండలంలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం విజయగౌరికి మద్దతు తెలపాలన్నారు. ఈ ప్రచారంలో ఏపీజీఎస్ నాయకులు కిల్లో జగన్నాథం, మగ్గన్న, తాంగుల హరి, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం




కొక్కిరాపల్లిలో క్రికెట్ పోటీలు ప్రారంభిస్తున్న సర్పంచ్ రామకృష్ణ

జి.మాడుగుల: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ తెలిపారు. మండలంలో పాలమామిడి పంచాయతీ కొక్కిరాపల్లి గ్రామంలో ఈ నెల19 నుంచి 21 వరకు మూడు రోజుల పాటు నిర్వహించే శ్రీకొక్కిరమ్మతల్లి అమ్మవారి జాతను పురస్కరించుకుని పాడేరు నియోజకవర్గంలో క్రికెట్ పోటీలను ఆదివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో లువ్వాసింగి ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, ఈశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఎర్రగొండమ్మ తల్లి ఆలయంలో చోరీ

కొయ్యూరు: ఎర్రగొండమ్మ తల్లి ఆలయంలో శనివారం రాత్రి చోరీ జరిగింది. ఆలయంలోని హుండీని గుర్తు తెలియని వ్యక్తులు పట్టుకుపోయారు. గతంలోను రెండు సార్లు ఇలానే జరిగింది. నడింపాలెం-శరభన్నపాలెం రహదారిలో నడింపాలెంకు పర్లాంగు దూరంలో ఆలయం ఉంది. సాయంత్రం అయితే జన సంచారం అంతగా ఉండదు. దీంతో దొంగతనాలకు ఆస్కారం ఎక్కువగా ఉంటుంది. దీనిపై ఆలయ కమిటీ దృష్టి సారించి దొంగతనాలు జరగకుండా చూడాలని భక్తులు కోరుతున్నారు.

హనుమ దీక్షల కరపత్రాల విడుదల



హనుమ దీక్ష కరపత్రాలు విడుదల చేస్తున్న సర్పంచ్ రాంబాబు, మత్స్యరాజు

జి.మాడుగుల: స్థానిక శ్రీపంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో సాయిరాం స్వామిజీ ఆధ్వర్యంలో ఏప్రిల్ 22న హనుమ జయంతిని పురస్కరించుకుని శ్రీ హనుమ దీక్షల మాల ధారణ కార్యక్రమాన్ని ఆదివారం సర్పంచ్ కిముడు రాంబాబు, ఎస్ఎస్ఎఫ్ జిల్లా సభ్యుడు మత్స్యరాస మత్స్యరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా హనుమాన్ ఆలయ ప్రాంగణంలో హనుమ దీక్ష కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ హనుమాన్ మాలలు ఉచితంగా సాయిరాం స్వామిజీ అందిస్తారన్నారు. పూర్తి వివరాలకు ఫోన్ నంబర్ 85005 09067లో సంప్రదించాలని కోరారు.

ఆదమరిస్తే గల్లంతే.!



గుమ్మసిరగంపుట్టు వద్ద కోతకు గురైన ఆర్అండ్‌బీ రహదారి



సుజనపేట ఆర్అండ్‌బీ మార్గంలో కుంగిపోయిన కల్వర్టు

- జోలాపుట్టు మార్గంలో కోతకు గురైన రోడ్డు
- సుజనకోటలో కుంగిన కల్వర్టు
- పట్టించుకోని ఆర్ అండ్ బీ శాఖాధికారులు

ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు నుంచి జోలాపుట్టు వెళ్లే మార్గంలో గుమ్మసిరగంపుట్టు వద్ద ఆర్అండ్‌బీ రహదారి కోతకు గురై ప్రమాదకరంగా తయారైంది. అలాగే సుజనకోట పంచాయతీకి వెళ్లే మార్గంలో ముత్యాలమ్మ జంక్షన్ వద్ద ఆర్అండ్‌బీ మార్గంలో కల్వర్టు ఆరు నెలల కిందట కుంగిపోయింది. దీంతో సగం రహదారి కోతకు గురైంది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. ఇక్కడ కోతకు గురైన రోడ్డు వద్ద భారీ గొయ్యి ఏర్పడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో తెలియని పరిస్థితి నెలకొంది. రహదారుల మరమ్మతులకు ఆర్అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతోంది. కోతకు గురైన ప్రదేశాలలో స్థానికులు పెద్ద రాళ్లు అడ్డు పెట్టి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకున్నారు. మరోవైపు మండల కేంద్రం ముంచంగిపుట్టులో మూడు నెలలకు జరిగే మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీలు దీనిపై ప్రశ్నిద్దామన్నా ఆర్అండ్‌బీ శాఖ నుంచి ఒక్క అధికారి కూడా రావడం లేదని ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. మండలంలో ఆర్అండ్‌బీ శాఖ అధికారులు ఉన్నట్టా? లేనట్టా? అని ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి గుమ్మసిరగంపుట్టు, సుజనపేట గ్రామాల మధ్య పాడైన ఆర్అండ్‌బీ రహదారులకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

‘ఉక్కు’ ఉద్యోగి మోహన్‌కుమార్ మృతికి సంతాపం



మృతుడు మోహన్‌కుమార్ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరు రూరల్: విశాఖ స్టీల్ ప్లాంట్‌లో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పని చేస్తున్న మోహన్‌కుమార్ మృతి చెందడం ఆ కుటుంబానికి తీరని లోటని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, పాడేరు ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజు అన్నారు. మండలంలో వంజంగి గ్రామనికి చెందిన పూజారి మోహన్‌కుమార్ ఆదివారం హఠాత్తుగా మృతి చెందినట్టు బంధువుల ద్వారా సమచారం తెలుసుకున్న ఎమ్మెల్యే.. గ్రామంలో మోహన్‌కుమార్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మోహన్‌కుమార్ అందర్నీ ఎంతో ఆప్యాయంగా పలకరించేవారని గుర్తు చేశారు. ప్రభుత్వం నుంచి రావల్సినవి ఏమైనా ఉంటే సకాలంలో అందేలా చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడ సురేష్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

విలీనంతో విద్యార్థులు చదువుకు దూరం



సుబ్బులులో పాఠశాలను కొనసాగించాలని నినాదాలు చేస్తున్న రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాజన్, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు

- సుబ్బులు గ్రామంలో విద్యార్థుల తల్లిదండ్రుల ఆందోళన
- ప్రస్తుత పాఠశాలలోనే 3, 4, 5 తరగతులు కొనసాగించాలని డిమాండ్

జి.మాడుగుల: పాఠశాలల విలీనంతో గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవుతారని రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో రాజన్ అన్నారు. మండలంలో మారుమూల గిరిజన గ్రామాల్లోని పాఠశాలలను దూరంగా ఉన్న ఆశ్రమ పాఠశాలలో విలీనం చేయడాన్ని ఆయన తప్పుపట్టారు. ఈ మేరకు ఆదివారం కిల్లంకోట పంచాయతీ సుబ్బులు, చిలకపనస గ్రామాల్లోని పాఠశాలల విదార్థుల తల్లిదండ్రులతో ఆయన సమావేశమయ్యారు. సుబ్బులు గ్రామంలో ఆందోళన చేశారు. గిరిజన గ్రామాల్లోని పాఠశాలలను యథావిధిగా కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. మారుమూల గ్రామాలకు రోడ్లు, రవాణా సదుపాయాలు లేకపోవడంతో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటారన్నారు. మండలంలో కిల్లంకోట, సుబ్బులు, చిలకపనస, బొయితిలి, సొరాపల్లి తదితర గ్రామాల్లోని ఎంపీపీ పాఠశాలలను ప్రభుత్వం విలీనం చేయవద్దని డిమాండ్ చేశారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లోని 3, 4, 5 తరగతుల విద్యార్థులు చిన్నపిల్లలు కావడంతో వేరే ప్రాంతాల్లోని ఆశ్రమాలకు పంపించడానికి తల్లిదండ్రులు భయపడుతున్నారని, విద్యార్థులు కూడా ఇబ్బందులు పడుతున్నారని ఆయన చెప్పారు. ప్రభుత్వం విలీనం విషయంపై పునరాలోచన చేయాలని కోరారు.

జడ్డంగి వద్ద ముమ్మరంగా వాహన తనిఖీలు



జడ్డంగిలో వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులు

రాజవొమ్మంగి: మండలంలోని జడ్డంగి స్టేషన్ ఎదుట ఆదివారం అడిషినల్ ఎస్ఐ విజయకుమార్ నేతృత్వంలో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. వచ్చే పోయే వాహనాలను ఆపి ఎక్కడి నుంచి ఎక్కడకు వెళుతున్నదీ ఆరా తీసి వివరాలు నమోదు చేశారు. రికార్డులు తనిఖీ చేశారు. మైనర్లకు, డ్రైవింగ్ లైసెన్స్ లేనివారికి వాహనాలు ఇవ్వొద్దని అవగాహన కల్పించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని సూచించారు.

ఫొటోగ్రాఫర్ల సంక్షేమానికి నిరంతరం కృషి



సమావేశంలో మాట్లాడుతున్న మండల ఫొటోగ్రాఫర్ల అధ్యక్షుడు సన్యాసిరావు

ముంచంగిపుట్టు: ఫొటో, వీడియోగ్రాఫర్ల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని మల్టీఫొటోగ్రాఫర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మండల అధ్యక్షుడు గొల్లోరి సన్యాసిరావు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం అసోసియేషన్ ఆధ్వర్యంలో ముంచంగిపుట్టు, పెదబయలు మండలాల ఫొటో, వీడియోగ్రాఫర్ల సమావేశం నిర్వహించారు. యూనియన్ నిబంధనలు, ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫొటో, వీడియోగ్రాఫర్లు తగు జాగ్రత్తలు పాటిస్తూ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఎటువంటి సమస్యలు తలెత్తినా వెంటనే యూనియన్ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు విక్రమ్, కార్యదర్శి బాబూలాల్, ఉప కార్యదర్శి అనిల్‌కుమార్, పెదబయలు యూనియన్ కార్యదర్శి రామారావు, సభ్యులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి



భూర్జలో యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేస్తున్న డీఎస్పీ సహబజ్ అహ్మద్, సీఐ సన్యాసినాయుడు

హుకుంపేట: గిరిజన యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని డీఎస్పీ సహబజ్ అహ్మద్ అన్నారు. ఆదివారం మండలంలోని బూర్జ పంచాయతీ కేంద్రంలో ఆయన స్థానిక పోలీసులతో కలిసి పర్యటించారు. యువతకు వాలీబాల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో యువత చెడు అలవాట్లకు బానిసై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. గ్రామల్లో గంజాయి సాగు, రవాణ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీఐ సన్యాసినాయుడు, ఎస్ఐ సురేష్‌కుమార్, స్థానిక ఎంపీటీసీ మజ్జి హరి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన విద్యార్థి సంఘం నేత సుమన్‌కు ఘన నివాళి



సుమన్ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

పాడేరు రూరల్: గిరిజన విద్యార్థి సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, దివంగత నాయకుడు బూడిదే సుమన్ ప్రథమ వర్ధంతి మండలంలో స్థానిక గిరిజన విద్యార్థి సంఘం(జీఎస్‌యూ) భవనంలో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి బంధువులు, సంఘం నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మరణం విద్యార్థి లోకానికి తీరని లోటని సంఘం నాయకులు అన్నారు. సంఘం రాష్ట్ర నాయకుడు సురేంద్రం, జేఏసీ కన్వీనర్ రామరావుదొర, ఉద్యోగ, విద్యార్థి సంఘాల నాయకులు కృష్ణారావు, శేషాద్రి, రాజుబాబు, కృష్ణవేణి, పద్మ, కొండమ్మ, గీతాంజలి పాల్గొన్నారు.

విద్యార్థినుల భద్రత సమష్టి బాధ్యత

- డీఎస్పీ శ్రీనివాసరావు
- అంబేడ్కర్ గురుకుల విద్యాలయం తనిఖీ



విద్యార్థినులను ఉద్దేశించి మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీనివాసరావు

నర్సీపట్నం : విద్యార్థినుల చదువుకు సురక్షితమైన వాతావరణం ఉండేలా చూడాలని డీఎస్పీ పి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నర్సీపట్నం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల గురుకుల విద్యాలయాన్ని డీఎస్పీ పరిశీలించారు. విద్యార్థినుల భద్రతకు ఉన్న చర్యలను తనిఖీ చేశారు. పిల్లలతో మమేకమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఈవ్‌టీజింగ్, చైల్డ్ మ్యారేజ్, సైబర్ నేరాల గురించి విద్యార్థినులకు వివరించారు. పిల్లల భద్రతకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమష్టి బాధ్యత వహించాలన్నారు. పిల్లలు ఎదగడానికి, అభివృద్ధి చెందడానికి ఆరోగ్యకరమైన వాతావరణ ఉండేలా చూసుకోవాలన్నారు. పాఠశాల భద్రతతో పిల్లల భావోద్వేగం, భౌతిక భద్రత ముడిపడి ఉన్నాయన్నారు. పిల్లలను హింస, బెదిరింపు, వేధింపులు, సైబర్ నేరం, మాదకద్రవ్యాల దుర్వినియోగం నుంచి సురక్షితంగా ఉంచడం పాఠశాల భద్రతలో భాగమన్నారు. బాల్య వివాహాల వల్ల విద్యార్థినుల జీవితాలు నాశనమవుతున్నాయన్నారు. బాల్య వివాహాలకు దూరంగా ఉండి చదువుపై మనస్సు పెట్టాలన్నారు. ఎవరైనా బాలికలపై వేధింపులకు పాల్పడితే పోక్సో కేసు నమోదు చేస్తామన్నారు. ఈ కేసులో ఇరుక్కున విద్యార్థుల జీవితం ఎందుకూ పనికిరాకుండా పోతుందన్నారు. సైబర్ నేరాల ముసుగులో పడకుండా విద్యార్థులు అవగాహన పొందడంతో పాటు తమ తల్లిదండ్రులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. సీనియర్ విద్యార్థులు జూనియర్ విద్యార్థులను వేధించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో టౌన్ సీఐ జి.గోవిందరావు, ఎస్ఐ ఉమామహేశ్వరరావు, ప్రిన్సిపాల్ ఎ.రాజేశ్వరి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇటుక లోడుతో ట్రాక్టర్ బోల్తా



బోర్నగూడెం వద్ద బోల్తా పడిన ఇటుకల లోడుతో వెళ్తున్న ట్రాక్టర్

రాజవొమ్మంగి: మండలంలోని బోర్నగూడెం సమీపాన ఆదివారం రాత్రి ఇటుకల లోడుతో వెళుతున్న ట్రాక్టర్ బోల్తా పడింది. ఆ సమయంలో తొట్టెలో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది. ట్రాక్టర్ నడుపుతున్న వ్యక్తి చాకచక్యంగా ఈ ప్రమాదం నుంచి బయటపడ్డాడు. ట్రాక్టర్ తొట్టి వెనక చక్రం ఊడిపడిపోవడంతో ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలిపారు. ఈ ట్రాక్టర్ జడ్డంగి అన్నవరం నుంచి ఇటుకల లోడుతో రాజవొమ్మంగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

సైబర్ నేరాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న ఎస్ఐ సన్నిబాబు

నక్కపల్లి: సైబర్ నేరాలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని ఎస్ఐ సన్నిబాబు తెలిపారు. ఆదివారం స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇటీవల కాలంలో సైబర్ నేరాల సంఖ్య విపరీతంగా పెరుగుతోందన్నారు. ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లు వాడే వారు జాగ్రత్తగా ఉండాలన్నారు. టెక్నాలజీ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని దుర్వినియోగం చేస్తూ అనేక అక్రమాలకు బ్లాక్ మెయిల్స్‌కు పాల్పడుతున్నారన్నారు. ఫోన్లో వీడియోలు, అసభ్యకర సందేశాలు పంపించడం, ప్రొఫైల్‌పిక్స్‌ను మార్ఫింగ్ చేసి బెదిరింపులకు దిగడం వంటి సంఘటనలు జరుగుతున్నాయన్నారు. విద్యార్థులకు ప్రభుత్వం నుంచి మంజూరయ్యే ఉపకార వేతనాలు, ఫీజు రీయంబర్స్‌మెంట్ విషయంలోనూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బ్యాంకుల నుంచి ఫోన్ చేస్తున్నామని, ఖాతా, ఆధార్, పాన్ కార్డు వివరాలు కావాలంటూ ఫోన్లు చేసి ఓటీపీలు తెలుసుకుని నగదు కాజేస్తున్నారన్నారు. వీటిపై అవగాహన పెంచుకోవడమే కాకుండా, ఇళ్లకు వెళ్లినప్పుడు నిరక్షరాస్యులైన కుటుంబ సభ్యులకు, చుట్టుపక్కల వారికి తెలియజేయాలన్నారు. ఏటీఎం కేంద్రాల వద్ద డబ్బులు డ్రా చేసే విషయంలో సహకరిస్తామంటూ పాస్‌వర్డ్ తెలుసుకుని నగదు కాజేస్తున్నారన్నారు. ఇటువంటి వారిపైనా జాగ్రత్తగా ఉండాలన్నారు. కళాశాలల్లో ఎవరైనా ర్యాగింగ్‌కు పాల్పడితే కళాశాల సిబ్బంది లేదా పోలీసులకు ఫిర్యాదు చేయాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్ ఉంటేనే వాహనం నడపాలన్నారు.

మోదకొండమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో మాడుగుల మోదకొండమ్మ



అమ్మవారి సన్నిధిలో దీపారాధన చేస్తున్న భక్తులు

మాడుగుల: మాడుగుల మోదకొండమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఈ సందర్భంగా అమ్మవారిని పూలు నగలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు బారులు తీరారు. ముందుగా ఆలయంలో వెలసిన పాదాలును దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రత్యేక కుంకుమ పూజలలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు ఆధ్వర్యంలో భక్తులకు ఉచితంగా ప్రసాదాలు, తాగు నీరు అందజేశారు.

ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు

మాకవరపాలెం : ప్లంబర్ కోర్సులో ఉచిత శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్ (నాక్) ఏడీ రవికుమార్ ఆదివారం తెలిపారు. మాకవరపాలెంలో ఇచ్చే ఈ శిక్షణకు 15 నుంచి 45 లోపు వయసు నుండి, 10వ తరగతి చదివిన వారు అర్హులన్నారు. మూడు నెలలపాటు శిక్షణ ఇస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు బీసీ కాలనీలో ఉన్న శిక్షణ కేంద్రంలో గానీ, 7075340910 నంబర్‌లో గానీ సంప్రదించాలన్నారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన

అచ్యుతాపురం రూరల్: ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై నిరసన తెలపాలని సీపీఎం మండల కన్వీనర్ రొంగలి రాము తెలిపారు. ఆదివారం స్థానిక కూడలిలో పార్టీ నాయకులు నిరసన తెలిపారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి జరిగిన అన్యాయంపై భాగస్వామ్య పార్టీలు టీడీపీ, జనసేన నోరు విప్పకపోవడం దారుణమన్నారు. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ పథకాలకు కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు తగ్గించారన్నారు. ప్రజల జీవన ప్రమాణాలు పెంచే విధంగా చర్యలు చేపట్టకుండా, కార్పొరేట్ సంస్థలు లాభపడే విధానాలు అమలు చేస్తున్నారని విమర్శించారు. సంపన్నులకు రాయితీలిస్తూ, సామాన్యులపై భారం వేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు గూడూరు వరలక్ష్మి, సీనియర్ నాయకుడు కె.రామ సదాశివరావు, మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

25వ తేదీలోగా ఫార్మర్ రిజిస్ట్రీ చేసుకోవాలి

మాడుగుల రూరల్ : రైతులు ఈ నెల 25 వ తేదీలోపు ఫార్మర్ రిజిస్ట్రి పూర్తి చేసుకోవాలని స్థానిక మండల వ్యవసాయాధికారి ఎం.వాసుదేవరావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలో గల సచివాలయాల పరిధిలో గల రైతు సేవా కేంద్రాల్లో ఆయా గ్రామ వీఏఏ, లేదా వీహెచ్ఏ ఈ రిజిస్ట్రేషన్ చేస్తున్నారన్నారు. రైతులు తమ భూములకు సంబంధించిన ఆధార్‌కార్డు, భూమి పట్టాదారు పాసు పుస్తకం లేదా, ఓబీ, పట్టాదారు పాసుపుస్తకానికి లింక్ అయిన ఫోన్ నంబర్‌ను తీసుకుని వెళ్లాలన్నారు. రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రీ చేయించుకోవాలని, లేదంటే రాయితీలు అందే అవకాశం లేదన్నారు.

450 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం



బెల్లం ఊట ధ్వంసం చేస్తున్న ఎస్ఐ వెంకటేష్, తదితరులు

గంగవరం(అడ్డతీగల): గంగవరం మండలం కొండలంపాలెం శివారు అటవీ ప్రాంతంలో ఆదివారం నాటుసారా బట్టీపై పోలీసులు దాడి చేశారు. సుమారు 450 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ తెలిపారు. ఈ బట్టీని నిర్వహిస్తున్న వ్యాపారిపై కేసు నమోదు చేస్తామన్నారు. నాటుసారా తయారీ, విక్రయాలు ఎవరైనా జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పాడేరు డివిజన్ :
9010973030, 9010234557
Office mail : sakshiadvtvsp@gmail.com